క్లుప్తంగా

క్రీడా సామగ్రి అందజేయాలి



జనగామ రూరల్: సీఎం కప్‌లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు సామగ్రి అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ ఏఓ మన్సూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఉపయోగపడాలంటే అన్ని రకాల క్రీడా సామగ్రి అందజేయడంతో పాటు ఒక కోచ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదీప్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా వారధి



చిల్పూరు: బీజేపీ బలోపేతానికి సోషల్ మీడియా వారధి లాంటిదని ఆ దిశగా పనిచేయాలని మాజీ మంత్రి గుండె విజయరామారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశం పాల్గొన్న ఆయన పలు సూచనలు చేశారు. నాయకులు పెండ్యాల దిలీప్, అంజిరెడ్డి, గొల్లపల్లి వాసు, అశోక్, రాజు, రమేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, రజనీకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో గౌడిశాల పిచ్చమ్మ మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబానికి బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సహకారంతో రూ. 20 వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆర్థికసాయం చేసి అండగా నిలిచిన బబ్బూరి శ్రీకాంత్ గౌడ్‌ను గ్రామస్తులు అభినందించారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



రఘునాథపల్లి: సేవలతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జనగామ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అన్నారు. జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన చింతకింది కృష్ణమూర్తిని శనివారం మండల కేంద్రంలో ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో రాణిస్తూ పద్మశాలీ కులస్తుల సమస్యల పరిష్కారంలో కృష్ణమూర్తి ముందు నిలవడం అభినందనీయమన్నారు. వెల్ది సర్పంచ్ కొయ్యడ మల్లేష్, గుగులోతు కొమురెల్లి, కొడిదేటి శంకర్, రాజ్‌కుమార్, కావటి ముత్యాలు పాల్గొన్నారు.

ఘనంగా వారకల్యాణం



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణచార్యుల వేద మంత్రాల నడుమ, భక్త జనసందోహం నడుమ ఘనంగా వార కల్యాణం నిర్వహించారు. ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన మల్కిరెడ్డి ముకేందర్‌రెడ్డి–రమాదేవి దంపతులు అన్నదానం చేశారు. ధర్మకర్తలు కుంచాల సంపత్‌రాజు, జంగిటి కుమార్, సిబ్బంది రమేష్, వీరన్న, శ్రీలత, లక్ష్మి, మల్లికార్జున్, హరిశంకర్, స్వరూప, మహేష్, విశాల్, రాజేష్, శేఖర్, అజయ్ పాల్గొన్నారు. అలాగే హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతి కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

మేయర్ పూజలు

మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామిని శనివారం వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా చేపట్టాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణవేణి



లింగాలఘణపురం: మాట్లాడుతున్న డీపీఎం వినీత

స్టేషన్‌ఘన్‌పూర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దని, త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని విశ్వనాథపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోళ్లు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ తదితరులు ఉన్నారు.

సమస్యలుంటే దృష్టికి తీసుకురావాలి

లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లతో ఏమైనా సమస్యలుంటే రైతులు తమ దృష్టికి తీసుకరావాలని ఐకేపీ డీపీఎం వినీత అన్నారు. శనివారం మండలంలోని పటేల్‌గూడెం, వడిచర్ల, నవాబుపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పటేల్‌గూడెం ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యం లారీని మండల కేంద్రంలోని నెల్లుట్ల వద్దనున్న మణికంఠ మిల్లర్ తీసుకోకుండా ఇబ్బంది పెట్టడంతో తహసీల్దార్ అంజయ్య, ఏపీఎం శంకరయ్యతో కలిసి అక్కడకు వెళ్లి మిల్లు యజమానితో మాట్లాడి ధాన్యం దించుకొనే విధంగా చర్య తీసుకున్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని మిల్లర్లకు పంపించాలని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని డీపీఎం పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జనగామ: పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాసంగి సీజన్ నేపథ్యంలో నకిలీ విత్తనాలు, బీటీ రకంతో పాటు ప్రభుత్వ నిషేధిత, కాలం చెల్లిన విత్తన ప్యాకెట్లు అమ్మకాలపై ప్రభుత్వం ఫోకస్ సారించింది. దీంతో పోలీసులు ఎరువుల దుకాణాల్లో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే కోణంలో పరిశీలన చేస్తున్నారు. స్టాక్ వివరాలు, రికార్డుల మెయింటెనెన్స్, విత్తన కంపెనీల బ్రాండ్‌లకు సంబంధించి లోతుగా పరిశీలన చేశారు. నకిలీ, నిషేధిత విత్తనాలు అమ్మితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ

మిల్లర్లు తరుగు తీస్తే చర్యలు

లింగాలఘణపురం: మిల్లర్లు రైతుల ధాన్యంలో తాలు, నాణ్యత ప్రమాణాలు లేవనే పేరుతో తరుగు తీస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రవీణ్ అన్నారు. శనివారం మండలంలోని వనపర్తి, పటేల్‌గూడెం ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా తాలు పేరుతో తరుగు తీస్తే సమాచారం ఇవ్వాలని, అందుకు సంబంధించిన పోస్టర్‌ను కొనుగోలు కేంద్రాల వద్ద అతికించారు.



పోస్టర్ అతికించిన పోలీసులు

గ్యాదరి కిశోర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

జనగామ రూరల్: మాదిగల పట్ల అవమానకరంగా వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో దళితబంధు విషయంలో ఎమ్మెల్యే కిశోర్ ఎమ్మార్పీఎస్ నాయకులను దుర్భాషలాడుతూ అవమానకరంగా మాట్లాడడం సరికాదని అన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయి అసహనంతో మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. పోరాటాలు చేసే నాయకులను కించపరిచే విధంగా మాట్లాడితే రాబోయే కాలంలో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కిశోర్ బహిరంగ క్షమాపణ చెప్పకుంటే గ్రామాల్లో తిరగనియ్యమని హెచ్చరించారు. ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, గుర్రం శ్యాంసన్, నిర్మాల భాస్కర్, గువ్వల రవి, రవీందర్, రాము, రాజేష్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవింద్ నరేష్

ఆలయంలో జడ్జి పూజలు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానాన్ని రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కొలకలపల్లి ఆంజనేయులు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజల చేశారు. వారికి ఈఓ లక్ష్మీప్రసన్న ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజ చేస్తున్న జడ్జి ఆంజనేయులు

ఎస్సైని కలిసిన ప్రజాప్రతినిధులు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్‌ను ఎంపీపీ రడపాక సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు తదితరులు పోలీస్‌స్టేషన్‌లో శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఎస్సైని ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ కొదారి కనకయ్య, ఎంపీటీసీలు, జ్యోతి రజిత, స్రవంతి ఉన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం’



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జఫర్‌గఢ్: కర్నాటక తరహాలో రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి పేర్కొన్నారు. మండల కేంద్రంలో రామాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. రైతుల రుణమాఫీ ఇప్పటి వరకు చేయలేదన్నారు. పార్టీ జిల్లా నాయకులు సిహెచ్ కృష్ణమూర్తి, పి సదయ్యగౌడ్, ఎండి అబిబ్‌ఖాన్, పి సత్యనారాయణరెడ్డి, కలకోట అనిల్, రడపాక డినియల్, తాటికాయల రాజేందర్, ఇల్లందుల బాబు, నంచర్ల యాదగిరి, కైరిక మల్లయ్య పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు



నారాయణపురంలో బోనాలతో మహిళలు

బచ్చన్నపేట: మండలంలోని లక్ష్మాపూర్, నారాయణపురంలో దుర్గామాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం ఇంటికో బోనం చేసి మహిళలు డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బైండ్ల వారు దేవత కథాపురాణాలను చెప్పి దుర్గామాత కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై నవీన్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్‌లు నూకల నవ్యానర్సిరెడ్డి, మాసపేట రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నర్మెట: నర్మెట ఎస్సైగా గైకాడి అనిల్ కుమార్ శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఎస్సై షేక్ జానీ పాషా ఈనెల 11న మహబూబాబాద్ జిల్లా నెక్కొండకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆత్మకూర్‌లో విధులు నిర్వహించిన 2020 బ్యాచ్‌కు చెందిన ములుగు వాస్తవ్యుడైన అనిల్‌కుమార్ గతంలో మిల్స్‌కాలనీలో సైతం విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గుడ్కా, గంజాయి మత్తు పదార్థాలు లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.



ఎస్సైని సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్

ఫర్టిలైజర్ షాపుల యజమానులు అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఎస్సై అనిల్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఏఓ ధరావత్ సంతోషితో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను, స్టాకులను పరిశీలించిన ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్టాక్ బోర్డులను ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, కాలం చెల్లిన వాటిన విక్రయించడం, నిల్వ ఉంచడం రైతలును మోసం చేయడమేనని అన్నారు. తనిఖీల్లో పీఎస్ సిబ్బంది ధనుంజయ్, రహమత్ అలి పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంతోపాటు మచ్చుపహాడ్, బొమ్మకూర్, హన్మంతాపురం, వెల్దండ, మల్కపేట, గండిరామారం, అమ్మాపూర్‌లలో ఏర్పాటు చేసిన ధాన్మం కొనుగోలు కేంద్రాలను పరిశీంచి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించి రైతులతో మాట్లాడారు.

ఎస్సైని కలిసిన ఆటో యూనియన్ నాయకులు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై గైకాడి అనిల్ కుమార్‌ను నర్మెట ఆటోయూనియన్ అధ్యక్షుడు గోపగోని రవికుమార్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. సుధాకర్, నాయక్, గట్టుమల్లు, అంజయ్య, నరేష్, చంద్రకాంత్, న్నెబోయిన అంజయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

రఘునాథపల్లి/చిల్పూరు: గొర్రెల పంపిణీలో ప్రభుత్వ జాప్యంపై ఈ నెల 22న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని పెంపకం దారులు జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. చిల్పూరు, రఘునాథపల్లి మండల కేంద్రాల్లో శనివారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. గొర్రెల యూనిట్ల పంపిణీలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి విడనాడాలన్నారు. గతంలో పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లలో అనేక అక్రమాలు జరిగాయని, రెండో విడతలో గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఆ సంఘం రఘునాథపల్లి మండల అధ్యక్షుడు గుండా వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యుడు బొల్ల రాజ్‌కుమార్, ఆవుల ప్రభాకర్, పేర్ని వీరస్వామి, మరాఠి జంపులు, పేర్ని నర్సయ్య, బాలబోయిన యాదగిరి, బడితె ఆంజనేయులు, రాజయ్య, లింగయ్య, వడికుమార్, పోలే రాజయ్య, జంగం సంపత్ తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న గుండా వెంకటయ్య

క్లుప్తంగా..

పుట్ట బంగారం పూజలు



బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో కురుమలు నిర్వహిస్తున్న బీరప్ప, కామరాతి పండుగలో భాగంగా శనివారం పుట్ట బంగారం కోసం డోలు చప్పుళ్లతో వెళ్లారు. అక్కడ పూజ నిర్వహించి తీసుకవచ్చిన పుట్ట బంగారంతో ఆలయం వద్ద గద్దెలను ఏర్పాటు చేసి పూజ చేపట్టారు. నేడు (ఆదివారం) చెరువులో నుంచి లింగాలను తీసుకొస్తామని ఒగ్గు పూజారులు తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలంటూ శనివారం హనుమకొండలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ త్వరలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

బచ్చన్నపేట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీఓ రఘురామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు జిల్లా, మండల ప్రత్యేక అధికారులు కూడా పాల్గొంటున్నారని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మురుగు నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక

జఫర్‌గఢ్: మండల కేంద్రమైన జఫర్‌గఢ్‌కు చెందిన నంచర్ల యాదగిరిని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో రామాలయం వద్ద శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. యాదగిరితో పాటు సాగరం, ఓబులాపూర్ గ్రామానికి చెందిన కైరిక మల్లయ్య, వంగాల దయాకర్ కూడా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

రుద్రయాగానికి ఆహ్వానం

బచ్చన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా కాచారంలోని కైలాసపురం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి, రేణుకామాత ఆశ్రమంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న చండీ సహిత రుద్రయాగానికి హాజరు కావాలని కొడవటూరు సిద్దులగుట్ట మాజీ చైర్మన్ రాజయ్య, కాశీపతి, వీరేషం తదితరులకు అర్చకుడు అంజయ్య ఆహ్వాన పత్రికలను అందజేశారు. లోక కల్యాణార్థం తలపెట్టిన పుణ్యకార్యానికి వచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.



పండ్ల పంపిణీ

జనగామ రూరల్: పట్టణానికి చెందిన ట్రాన్స్‌జెండర్ అప్సర పుట్టిన రోజు సందర్భంగా వర్ధన్ ఆశ్రమం, రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో శనివారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి, ట్రాన్స్ జెండర్ చంద్రగిరి రావి, టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాలివానతో మల్బరీ షెడ్ ధ్వంసం

లింగాలఘణపురం: మాణిక్యాపురంలో శనివారం సాయంత్రం కురిసిన గాలివానతో పాటు వగడళ్లు కురువడంతో గ్రామానికి చెందిన రాగం బాలరాజు మల్బరీ షెడ్ ధ్వంసమైంది. రేకులన్నీ గాలికి ఎగిరిపడి ధ్వంసం కాగా సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గత ఏడాదిగా మల్బరీ తోటతో పట్టుపురుగుల పెంపకంతో ఉపాధి పొందే తనకు పూర్తిగా నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ దూసరి విజయ్‌కుమార్ ధ్వంసమైన షెడ్‌ను పరిశీలించి బాధితునికి భరోసా కల్పించారు.



ధ్వంసమైన మల్బరీ షెడ్

సోలోమోన్‌రాజ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి



పాస్టర్లతో నంగునూరి టిక్నా

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ క్రిస్టియన్ నాయకుడు సోలోమోన్‌రాజ్‌కు సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నంగునూరు టిక్నా కోరారు. డివిజన్ కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 31 జిల్లాల తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, బీఆర్ఎస్ క్రిస్టియన్ నాయకుడిగా ఉన్న గోనె సోలోమోన్‌రాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన హక్కులు కల్పించిన సీఎం కేసీఆర్‌ను అభినందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులపై నిరంతరం పోరాటం చేస్తున్న సోలోమోన్‌రాజ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు శ్యాంసన్, కిరణ్, మోజెస్, కోర్నెల్, సుకుమార్, సుధాకర్, థామస్, ప్రవీన్, సీమోను, తిమోతి, డేవిడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

జఫర్‌గఢ్: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించి కూలీలను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ పార్టీ నాయకులతో కలిసి శనివారం ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు ఎండి జాఫర్, కూలీలు కుల్లా సారంగం, వెంకన్న, శ్రీదేవి, నాగరాజు, వెంకటయ్య, కొమురయ్య, గట్టయ్య, స్వరూప, రమ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్